శ్రీమాత్రే నమః శ్రీ గురుభ్యో నమః

**<u>సంపూర్ణ కాశీరామేశ్వరయాత్ర</u>**

తొలుత గురుదేవుల ఆశీస్సుల నొంది  పయనమున కుపక్రమించె ..

కాలభైరవుడు కాశీ దర్శింప అనుమతించె ..

ఢుంఢి గణపతి నిలువ స్థానమిచ్చె..

■ఢుంఢి విఘ్నపతికి దండంబు తొలుతను
■జయము కలుగు విధము జరుగునటుల
■చివరి యాత్ర వరకు చేదోడుగా నుండి
■అలుపులేక మమ్ము ఆదుకొనుమ

దండపాణి ఆశీస్సులొందినాము..

కాశివిశ్వనాధ అభిషేకం కనులార దర్శనంబు ..

■కాశివిశ్వనాధ కనులార వీక్షించి
■ముదము గూర్చె సామి పురము నెల్ల
■చింత దీర్చు నరుని చిన్ముద్ర శంకర
■మ్రొక్కెదము సతతము మోదమలర

అన్నపూర్ణ అభయ హస్తము కడుపార వడ్డింప..

■అన్నపూర్ణయమ్మ యనురాగవల్లివి
■నిరతమన్నదాన నెరపు తల్లి
■శాంత కరుణ మూర్తి సౌభాగ్య దాయిని
■అభయ హస్తమిచ్చి శుభముగూర్చు

విశాలాక్షి రూపము నయనార విందమై..

■కరుణ జూపు దేవి కాశి విశాలాక్షి
■పసుపు కుంకమిచ్చు భవుని రాణి
■మీన నేత్ర సొబగు మిరుమిట్లు గొలుపగ
■దీవెనిచ్చు నమ్మ దేవమాత

గుంపు గుంపులుగ మేము గవ్వలమ్మను గాంచి గవ్వ ప్రసాదము పొందినాము..

కాలభైరవ వత్సర హరియాళీ ఉత్సవ వైభవము  తిలకించినాము..

■కాలభైరవ దయ కల్గియున్న జనులె

■కాశిపురమునందు కాలు మోపు
■కర్మ పాశములను కాలరాయగలుగు
■అష్ట సిద్ధులిచ్చు అభయదాత

గలగల గంగమ్మ ఉరకలెత్తుతు..
గంగ హారతులు వీక్షకులకు విందు గొలిపె..

■గలగలమను వడితొ గంగమ్మ పరుగులు
■చూచువారికెంతొ చూడ నొబగు
■గంగ హారతులను కనులార చూడగ
■పాపరాశి యంత పారిపోవు

కేదార్ ఘాట్ తొల్లి స్నానమొనర్చి కేదారనాథ దర్శనం ప్రమోదం..
ప్రయాగ సంఘమ తీర్థాన ప్రక్షాళనొంది మాధవేశ్వరి కనులార కాంచితి..
దక్షిణా పథమునకు పయనమైనాము..
యోగనిద్రలో శ్రీరంగనాథుడు కొలువుదీరి సాక్షాత్కరించె..

■యోగముద్ర నుండి రంగనాథ విభుడు
■వచ్చు భక్తులకును వరములిచ్చు
■పళని గౌరితనయ పరిపూర్ణ రూపము
■చూడ సంబరమగు చూపరులకు

నేరూర్ సదాశివబ్రహ్మేంద్ర మఠం దర్శనం గురువుల ఆశీస్సులొంది..
గగనాన తాకు నిలువెత్తు నమక్కళ్ అభయాంజనేయ స్వామి అభయమొంది..
ముచ్చటగా ముందుకు సాగినాము..
పళని సుబ్రహ్మణ్య మంగళ రూపము జూడ సంబరమయ్యె..
కడుపు చల్లనితల్లి మాసాని అమ్మ కనులార గాంచితి..
గురవాయూర్ ముద్దులొలుకు బాలకృష్ణుడు మురిపెమున  కాన్పించె..

■ముద్దులొలుకు కృష్ణ మురిపాల ఆకృతి
■ముచ్చట గలిగించి ముదము గూర్చె
■ఆదిశంకర గురువాశ్రమమును గని
■పరవశించె మదియ భక్తి తోడ

కాలాడి ఆదిశంకరుల ఆశ్రమాన అడుగిడినాము..
మందగమని పూర్ణానదిని తిలకించి ఆర్యాంబ సమాధి గాంచినాము..
ఎట్టిమన్నూర్ మహాదేవుని ఆశీస్సులొందె..

కడంబపూజ భగవతి రూపు కనులార గని పారాయణంజేసి పులకితులమయ్యే..
కొట్టాయం శివుని కనులార వీక్షించి..
చోటానికురా మాత దర్శనంబు కావించె..
అనంతపద్మనాభుని శయనరూపు దేదీప్యమానమై వెలుగులీన మది సంతసమాయె..
కన్యాకుమారి సంద్రనడుమ సూర్యోదయం కనువిందుజేసె..
కన్యకాపరమేశ్వరి ముక్కెర మెరుపు మిరుమిట్లుగొలిపె..
ఆండాళ్ తల్లి సువర్ణ మందిరవెల్గులు అంబరమంటె..
కుర్తాళ మఠయోగి పుంగవుల దర్శనం సర్వ పాపహరణం..
కుర్తాళ జలపాత స్నానం బాగుబాగు..
రామేశ్వర ఇరువది రెండు తీర్థముల స్నానమాడి పునీతమయ్యే..
రామనాథ్ రామలింగేశ్వరునికి గంగాభిషేకమొనర్చి..
పర్వతవర్థనిమాత దర్శనంబు ముదము గొల్పె
సంద్రాన సరిగంగ స్నానమాచరించి సైకతలింగ పూజచేసినాము..

■సంగమ జలమందు సంద్ర రామేశుడు
■స్నానమాచరించు సంతసమున
■సైకతేశ్వరుండు సంగమ జలమున
■ఆయోజించు విధము నబ్బురంబు

■సంద్రతట వెలిసిన జపముద్ర శంభుడు
■వెతలు బాధ నంత పెరికివేసి
■రామలింగ ఈశ నామంబున మహిని
■ఖ్యాతి నొందె సామి కారుణ్యధాముడు

స్త్రీల ప్రాయశ్చిత్త పూజ కావించుకొని అయ్యవారి దర్శనం చేసినాము..
మదురమీనాక్షీ దివ్య మనోహర రూపముగాంచి ముగ్ధులమయ్యే..
కలియుగ వైకుంఠుడు ఆపద మ్రొక్కులవాడు ఆనందనిలయుడ్..
అజగర్ కోవిల్ దవ్యమంగళ రూపము వీక్షించి ఆనంద పరవశమయ్యే..
కావేరీ జల పుష్కర స్నానము కలకాలము జ్ఞప్తినుండు..
పంచభూత జంబుకేశ్వర లింగదర్శనము..
అఖిలాండేశ్వరి సూర్యచంద్ర శక్తి నిక్షిప్త తాటంక దివ్యదర్శనం అపురూపంబు..
ఆకాశఛత్ర కాళీమాత ఆశీస్సులొంది..
చండీ హోమ వీక్షణం ఆనందమాయె..
సమయపురి మారియమ్మ రూపు మరిమరి చూసి తిరిగి పయనమాయె..
ప్రయాగవైపు బృంద సభ్యులమంతా..

వేణీదానం: ప్రయాగ సంగమతీర్ధ తీరాన పూబోణిలు కూడి వేణీదానం వైదికముగా గావించె.. పసుపు కుంకుమలు పది కాలాలు పదిలముగ కాపాడు మని పడతులందరు మాధవేశ్వరిని ప్రార్ధించె మదిన్..

సైకతలింగం: సాగరాన సేకరించిన సైకతలింగం త్రివేణీ సంగమందు కలిపినాము..

త్రివేణీ సంగమ జలాలు సాగరతట రామలింగేశ్వర అభిషేకం,

సాగర సైకతమును సేకరించి సంగమతీర్ధ జలాల కలుపుట సంపూర్ణ కాశీయాత్ర అనబడు..

పూర్వులు పెట్టిన రీతి అమోఘం..

సాగి సాగి నది సాగరం చేరు అన్నట్లు ఆత్మనది పరమాత్మ సాగరంబు అయిన ఆత్మ పరమాత్మను జేరుట జీవన్ముక్తి..

ముక్తిపధమున జీవుడు పయనించుటకు పెద్దలు ఆవిష్కరించిన నిగూఢ అంతరార్ధముగా  గోచరంబగు..

పూర్వులందరికీ శతకోటి ప్రణతులు

■సాగిసాగి నదియ సాగరాన కలియు

■ముక్తికోరి నరులు భక్తి కూడి

■సాధనంబు చేయ సాధ్యంబు విజయము

■జన్మమెత్తి జనులు సఫలమొందు

సోదర సమరీతి సహృదయ సహకార మందించె..

ఆడబడుచులు సంతోష కాలంబు గడిపె..

పునః పునః దర్శనంబు కోరి దేవతలనర్ధిస్తు మనసార..

సాష్టాంగ ప్రణామములు మీకు,  కాశీయాత్ర ఫలము మాకు..

■ఎందు పుట్టినామొ ఎందు పెరిగినామొ

■అంట అయ్యవార్ల అండ కొండంతగ

■కాశీ  పూర్ణయాత్ర కూడి జేసె

■కోరుతు నిరతంబు కరముల మ్రొక్కెదన్

ప్రభాకరుని ఆధ్వర్యం శర్మ సహకారం సభ్యులకెంతో  ముదముగూర్చె..

మాతా గంగా భవానీ శాంకరీదేవి